మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# పెట్రోల్.. పరేషాన్



జడ్చర్లలోని శ్రీనివాస్ థియేటర్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వద్ద బారులు దీరిన వాహనదారులు

- పలు బంకుల్లో నో స్టాక్ బోర్డులు
- ఆందోళన చెందుతున్న వాహనదారులు
- బంకుల వద్దకు బారులు
- మహబూబ్‌నగర్ జిల్లాలో 112 పెట్రోల్ బంకులు
- అపోహలు వద్దు.. సరఫరాలో ఎలాంటి కొరత లేదు : డీఎస్ఓ గంప శ్రీనివాస్




**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 25, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని పలు పెట్రోల్ బంకుల్లో స్టాక్ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల నో స్టాక్ బోర్డులు పెట్టడంతో వాహనాలు నిలిచిపోయినట్లు తెలుస్తున్నది. ఒక్క సారిగా పెట్రోల్ కొరత ఏర్పడిందంటూ సోషల్ మీడియాలో వార్తలు కథనాలు చూసిన ప్రజలు పెట్రోల్ బంకుల వద్దకు బారులు తీరడంతో బంకుల వద్ద రద్దీ నెలకొన్నది. అయితే, ఇంధన కొరత లేదని, పరిస్థితి సాధారణంగానే ఉందని అధికారులు భరోసా ఇస్తున్నారు పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం సంక్షోభం కారణంగా, సరఫరా విషయంలో ప్రజలలో భయాందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో డీలర్ల చెల్లింపులలో తాత్కాలిక ఇబ్బందులు ఏర్పడటం వల్ల కొన్ని చోట్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కేవలం తాత్కాలికమే నని ప్రజలు కంగారు పడి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని హెచ్చరించారు.

### సరిపడా నిల్వలు ఉన్నాయి : డీఎస్ఓ గంప శ్రీనివాస్



మహబూబ్‌నగర్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కు సంబంధించి ఎలాంటి కొరత లేదు అని డీఎస్ఓ గంప శ్రీనివాస్‌తెలిపారు. సేల్స్ ఆఫీసర్‌తో కూడా తాను మాట్లాడి క్లారిటీ తీసుకున్నట్లు తెలిపారు. పెట్రోల్ బంకులు బంద్ చేస్తారు అన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదు అని, యధావిధిగా బంకులు కొనసాగుతాయని తెలిపారు. అయితే ప్రజలు పొదుపు పాటించాల్సి న అవసరంఎంతైనా ఉందని, ప్రస్తుతం ఉన్నపరిస్థితి దృష్ట్యా ప్రజలందరూ సహకరించాలని కొంత మేరకైనా పొదుపు పాటించాలని గంప శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలిపారు.

### కొరత లేదు..

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ లభ్యతపై వస్తున్న ఊహాగానాలకు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ తెర దించింది. దేశంలోని అన్ని రిటైల్ అవుట్ లెట్లలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సి న అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు పౌరులకు కొన్ని కీలక సూచనలు చేస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. చమురు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, కాబట్టి భవిష్యత్తు అవసరాల కోసం పెట్రోల్ లేదా డీజిల్‌ను ఇళ్లలో నిల్వ చేసుకోవద్దని ప్రభుత్వం కోరింది. ఇలా నిల్వ చేయడం వల్ల ప్రమాదాలుసంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది. బంకుల వద్ద అనవసరమైన రద్దీని తగ్గించాలని, సాధారణ వినియోగానికి సరిపడా మాత్రమే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగం సూచిస్తున్నది.

### అవసరం లేకున్నా..

చాలామంది వాహనదారులు పానిక్ అవుతున్నట్లు తెలుస్తున్నది. పెట్రోల్ కొరత ఉంది బంకులు బంద్ చేస్తారు అన్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అంతా ఒక్కసారిగా పెట్రోల్ బంకుల వద్దకు చేరుకోవడంతో బంకుల వద్ద రద్దీ ఏర్పడుతుంది. ఎవరు ఆందోళన చెందవద్దని పెట్రోలు డీజిల్‌నిల్వలు సరిపడా ఉన్నాయని, అంతా ఒక్కసారి బంకుల వద్దకు చేరుకోవడంతో నిర్వాహకులు నోస్టాక్ బోర్డు పెట్టాల్సి న పరిస్థితి ఏర్పడు తుందని అధికారులు చెబుతున్నారు.



జడ్చర్లలో పెట్రోల్ బంక్ వద్ద బారులు దీరిన వాహనదారులు

# వరి ధాన్యం సేకరణ పకడ్బందీగా నిర్వహించాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలి
- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్

**గద్వాల మార్చి 25, ప్రభాతవార్త:** 2025-26 యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తి ఏర్పాట్లు చేసి, నిబంధనల ప్రకారం కొనుగోళ్ల చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. జిల్లాలో మొత్తం 87 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నటు తెలుపుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్‌లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, తేమనిర్ధారణ యంత్రాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల వద్ద నుండి అదనపు చార్జీలు (హమాలీ, గన్నిబ్యాగులు మొదలైనవి) వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారులు ధాన్యం తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించి నమోదు చేయాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, అందులో టోల్ ఫ్రీ నంబర్, కనీస మద్దతు ధర, తదితర వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో మూవ్‌మెంట్ రిజిస్టర్ నిర్వహిస్తూ రోజువారీ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టుల ద్వారా అక్రమ రవాణాను అరికట్టాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఇతరరాష్ట్రాల నుండి ధాన్యం జిల్లాలోకి రాకుండాకట్టుదిట్టమైన నిఘా ఉంచాలని సూచించారు. ఆర్టీఓ అధికారులు రవాణా పర్యవేక్షణను కట్టుదిట్టంచేయాలని పేర్కొన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ కంట్రోల్ రూమ్ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, టెంట్లు మరియు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓపీఎంఎస్‌లో వివరాలను రోజువారీగా అప్‌డేట్ చేయాలన్నారు. రైతులకు చెల్లింపులు సమయానికి, బిల్లులు పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్‌హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, పౌర సరఫరాల మేనేజర్ విమల, జిల్లా వ్యవ సాయాధికారి వీరప్ప, కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారిని పుష్పమ్మ, డిఆర్డిఎ ఏపీడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు అభివృద్ధికి సహకరించండి

- ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ నాగమణి, వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు
- అక్రమంగా వెలిసిన డబ్బాలు తొలగింపు



అక్రమంగా వెలిసిన డబ్బాలను మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో తొలగిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ మార్చి 25, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అధికారపక్షంతో పాటుగా ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్న టిఆర్ఎస్, బిజెపి పార్టీలు అన్ని విధాలుగా సహకరించాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ నాగమణి వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్ శశిధర్ తదితరులు విజ్ఞప్తి చేశారు. మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆత్మకూరులోని బైపాస్ రోడ్డు నుండి అమరచింత రోడ్డు వైపు అక్రమంగా రోడ్లు భవనాల శాఖ -మిగతా4లో..

# ఆన్లైన్ ద్వారానే ఇసుక..

- ఏప్రిల్ 1 నుంచి నూరు శాతం అమలు చేయాలి
- ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి
- క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి
- జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 25, ప్రభాతవార్త:** జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూగుప్తా ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించి ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు తీసుకోవాల్సి న చర్యలపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మండలాల వారీగా మన ఇసుక వాహనం ద్వారా ఇసుక బుకింగ్, కూపన్లు ఆన్లైన్ , ఆఫ్ లైన్ లో జారీ సరఫరా పై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 1నుండి నూరు శాతం మన ఇసుక వాహనం ద్వారా ఆన్లైన్ ద్వారా మాత్రమే సరఫరాచేయాలని ఆదేశించారు. గతంలో తనిఖీ కమిటీ గుర్తించిన 16 రీచ్‌లలో బాగంగా రెండు మాత్రమే ఇసుక బుకింగ్ కు నడుపబడుతున్నట్లు అధికారులు వివరించారు. ఇందులో అడ్డాకల్ మండలం కన్మనూర్, మూసాపేట మండలం పోల్కాంపల్లిలో ఇసుక రీచ్‌ల నుండి మన ఇసుక వాహనం ద్వారా ఇసుక బుకింగ్ సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు మిగతా 14 ఇసుక రీచ్ లను ఆన్లైన్ బుకింగ్ ద్వారా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు మండల స్థాయిలో తహశీల్దార్‌లు, పోలీస్ అధికారులు క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీ లు నిర్వహించాలని ఆదేశించారు.
తనిఖీల్లో అక్రమ ఇసుక రవాణా స్వాధీనం.. అక్రమ ఇసుక డంప్‌ల వివరాలు, అక్రమ రవాణా లో పటుకున్న లారీలు, ట్రాక్టర్లు, అలాగే అక్రమ ఇసుక తవ్వకాలపై విధించిన జరిమానాలపై సమగ్ర సమాచారం ఇసుక వాట్సప్ గ్రూప్ లో వివరాలు పోస్ట్ చేయాలని తహశీల్దార్ లను ఆదేశించారు. ఇకపై అన్ని ఇసుక బుకింగ్‌లు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని ఆమె స్పష్టం చేశారు. వచ్చే సారి నిర్వహించే జిల్లా స్థాయి ఇసుక సమీక్ష సమావేశానికి ప్రతి తహసీల్దార్ తమమండలాల్లో జరిగిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్‌ల వివరాలు, అక్రమ ఇసుక తవ్వకాలపై తీసుకున్న చర్యలు, స్వాధీనం చేసిన వాహనాల -మిగతా4లో..

# అర్హులైన వారందరికీ బ్యాంకర్లు రుణాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల మార్చి25, ప్రభాతవార్త:** జిల్లాలో ప్రాధాన్యత రంగ రుణాల లక్ష్య సాధనలో బ్యాంకులు ముందుండాలని, బ్యాంకుల సహకారంతోనే అర్హులైన వారంతా రుణాలను సద్వినియోగం చేసుకోగలుగుతారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా డిసిసి డిఎల్ఆర్సి కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన, ఇతర రుణ లక్ష్యాలపై బ్యాంకింగ్ పనితీరును సమీక్షిస్తూ, అన్ని బ్యాంకులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రుణాల మంజూరులో సమతుల్యత అవసరమని, బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తున్న రుణాలు సద్వినియోగం అయ్యేలా పర్యవేక్షణ చేయాల్సి న అవసరం ఉందన్నారు. పీఎం ఈజీపి, ముద్ర, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ కార్పొరేషన్, తదితర రుణాల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఈనెల 31 లోగా పిఎంఎఫ్ఎంఈ లోన్స్ మంజూరు చేసి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ఆర్థిక అక్షరాస్యతపై గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా అవగాహన పెంచాల్సి న అవసరం ఉందన్నారు. ఫైనాన్షియల్ లిటరసీ క్యాంపుల్లో పాల్గొనే వారి సంఖ్య తక్కువగా ఉందని, పెద్ద ఎత్తున పాల్గొనేలా అవగాహన కలిగించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సదుపాయాలను మరింత విస్తరించాలని సూచించారు. బ్యాంకింగ్ అవుట్లెట్స్, ఏటీఎంల సంఖ్యను జిల్లాలో ఇంకా పెంచాల్సి న అవసరం ఉందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రుణాల విషయంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, రైతులకు సులభంగా రుణాలు అందేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ గృహాల నిధుల నుండి బ్యాంకర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించి రికవరీ చేయరాదని సూచించారు. పేద ప్రజలకు, మహిళా సంఘాలకు ఆర్థికంగా అభివృద్ధి పరిచే విధంగా అన్ని రంగాలలో బ్యాంకర్లు అధికారులు సమన్వయంతో పనిచేసి రుణాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్బిఐ ప్రతినిధి లక్ష్మీ శ్రావ్య, నాబార్డ్ డీడీఎం మోహన్ రెడ్డి, ఎల్డిఎం శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయా బ్యాంకుల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- ఆహార పదార్థాల గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



విద్యార్థులకు అందించే ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ , అధికారులు

**వనపర్తి, మార్చి 25 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ పెబ్బేరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది ఆహార పదార్థాల నిల్వ గదిని పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. మెస్ కమిటీ విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, పాఠశాలకు సరుకులు వచ్చిన ప్రతిసారీ రిజిస్టర్లలో మెస్ కమిటీ విద్యార్థులు సంతకం చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే ఆహార పదార్థాలగడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అనంతరం ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి, బాగా సిద్ధమై పరీక్షలను మంచిగా రాయాలని ప్రోత్సహించారు. మంచిమార్కులు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పీఎంశ్రీ పథకం కింద పాఠశాలలో చేపట్టిన పనులపైసమీక్ష నిర్వహించిన కలెక్టర్, పాఠశాలకు అవసరమైన అంశాలపై వెంటనే ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. -4లో..

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రస్సులు పంపిణీ



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 25 ప్రభాతవార్త:** తాడూర్ మండలంలోని సిరసవాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.17వేలు విలువగల స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ రాధాకృష్ణ హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని, అవి ఉపయోగించుకొని విద్యార్థులు చక్కగా చదువుకొని పాఠశాలకు, గ్రామానికి చక్కని పేరు తీసుకొని రావాలని, చిన్నతనం నుండే చదువుతో పాటు ఇతరులకు సాయం చేసే అలవాటు కూడా నేర్చుకోవాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక పాఠశాలలకు మంచినీటి సౌకర్యం కొరకు వాటర్ ట్యాంక్‌లు ఇస్తున్నామని, ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని, ఏ పాఠశాలకైన వాటర్ ట్యాంక్ కావాలంటే లయన్స్ క్లబ్ సభ్యులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి మాట్లాడుతా స్వచ్ఛంద సంస్థలుఎటువంటి సేవా కార్యక్రమం నిర్వహించాలన్నా దాతల సహకారం అవసరమని ఈ కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించిన సిరసవాడ గ్రామంలో జన్మించిన క్లబ్ మాజీ అధ్యక్షులు వాస రాఘవేందర్, క్లబ్ మాజీ కోశాధికారి నాగరాణిలకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లంపల్లి రమేష్ మాట్లాడుతూ అడిగిన వెంటనే స్పందించి పాఠశాల విద్యార్థుల కోసం స్పోర్ట్స్ డ్రెస్సలను అందించిన లయన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. తన ఆహ్వానం మేరకు వ్యక్తిగతంగా కార్యక్రమానికి హాజరైన లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాస లక్ష్మి మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హజ్ యాత్రికులకు వాక్సినేషన్ ప్రారంభం




వ్యాక్సినేషన్ వేసి ప్రారంభిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 25 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా నుండి హజ్‌కు వెళ్తున్న యాత్రికుల కోసం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం నాడు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన వాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి కుమార్ నాయక్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిం డెంట్ డాక్టర్ టి.ఉషా రాణి యాత్రికులకు వాక్సినేషన్ డ్రాప్స్ వేసి ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యాత్రికులకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రత్యేకంగా వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అనంతరం వారికి వ్యాక్సినేషన్ చేశారు. హజ్ యాత్రకు వెళ్తున్న ప్రతి భక్తునికి ఆరోగ్యంగా ఉండేలా ఆరోగ్యశాఖ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ విభాగాధిపతి డాక్టర్ సూర్యనారాయణ యాత్రికులను ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలుచేశారు. అనంతరం వారికి ప్రత్యేక వ్యాక్సిన్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ సురేష్‌బాబు, నాగంకర్నూల్ హజ్ కమిటీ సభ్యులు షేక్ ఫరీద్, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి రేసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజీమ్, డాక్టర్ ప్రశాంత్, పి.పి.యూనిట్ వైద్యాధికారి డాక్టర్ పి. సృజన, ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్, మహిళ ఆరోగ్య కార్యకర్త సరస్వతి, ఆరోగ్య సిబ్బంది నవీన, సుకుమార్ రెడ్డి, వై. శ్రీనివాసులు, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ టి.యాదగిరి, గంగా, కుమార్, వనిత, కిషన్, దివ్య, హజ్ యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన ఉచిత మెగా వైద్య శిబిరం

**కోయిలకొండ మార్చి 25, ప్రభాతవార్త:** కోయిలకొండ మండలంలోని ఉబ్బడి తండా గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య చికిత్స శిబిరం విజయవంతం అయిందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ హరి సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు విస్తరించాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ హాస్పిటల్ వారి వైద్య బృందం సౌజన్యంతో ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ భరత్ నందన్ రెడ్డి సహకారంతో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు వారికి గ్రామ సర్పంచ్ హరిసింగ్‌నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరానికి గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి వైద్య చికిత్సలు నిర్వహించుకోవడం జరిగింది. రోగులకు ఎస్వీఎస్ హాస్పిటల్ వారు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది వర్షిత, గణేష్, హర్షిని, మనోజ్, పిఆర్ఓలు మనోహర్, గౌరీశంకర్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బి కృష్ణ, మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మల్లయ్య యాదవ్, గ్రామ పెద్దలు విట్టల్, సాయి రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్కిచర్ల జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన డీఈఓ

**- టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులతో ఇంటరాక్షన్**

**- మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన డీఈఓ**

**భూత్పూర్, మార్చి 25, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(జడ్పీహెచ్ఎస్)ను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రవీణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న అక్షయపాత్ర మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, ఆహార పదార్థాలను డీఈఓ పరిశీలించి భోజన పథక నిర్వాహకులకు తగు ఆరోగ్య సూచనలు చేశారు. అనంతరం పరీక్షలు రాస్తూ పరీక్ష లేనిరోజున పాఠశాలకు వచ్చి పరీక్షకు సంబంధించి సబ్జెక్టు టీచర్లతో పాఠశాలలో విషయ పరిజ్ఞానాన్ని పొందుతున్న టెన్త్ విద్యార్థిని విద్యార్థులతో డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఇంటరాక్ట్ అయ్యారు. పరీక్షలు ఎలా రాస్తున్నారు.. వారి సాధక బాధకాలను డీఈఓ అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జీహెచ్ఎం లావణ్యతో పాటు ఉపాధ్యాయులు కె చెన్నయ్య, బాల్‌లింగయ్య, సురేష్‌బాబు, శ్రీదేవి, సీఆర్పీ ఇక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

## మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలుకే

**ఎస్ఐ జె.నవీన్ కుమార్**

**వీపనగండ్ల మార్చి 25, ప్రభాతవార్త:** ఇద్దరి కన్నా ఎక్కువ మందిని టూ వీలర్ పై ఎక్కించుకొని నడిపిన మద్యం తాగి డ్రైవింగ్ చేసిన హెల్మెట్ లేకుండా బండ్లు నడిపిన తదితర రూల్స్ ను అతిక్రమించి డ్రైవింగ్లు చేస్తే అట్టివారిపై కఠినంగా శిక్షి ంచి కేసు నమోదు చేసి జైలుకు పంపడమేనని వీపనగండ్ల ఎస్సై జె నవీన్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం నాడు మోటార్ వెహికల్స్‌ను చెకింగ్ చేస్తూ ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని మోటార్ వెహికల్స్ నడిపే వ్యక్తులు జాగ్రత్తగా ప్రయాణాలు చేయాలని ముఖ్యంగా యువత మద్యం తాగి బండ్లు నడపడం వల్ల అనేక ఇబ్బందులకు గురవడమే కాక యాక్సిడెంట్లకు దారి తీస్తుందని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తగా మోటార్ వెహికల్స్ నడపాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు వారి సిబ్బంది కూడా తనిఖీలో పాల్గొన్నారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

## శ్రీ సీతారామాంజనేయ గుడి నిర్మాణానికి విరాళాలు

**కోయిలకొండ మార్చి25, ప్రభాతవార్త :** కోయిలకొండ మండలం కొత్లాబాద్ గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ గుడి పునర్నిర్మాణానికి గ్రామంలోని దాతలు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ గ్రామవాసులు ఆలయ నూతన నిర్మాణానికి విరాళాలను అందజేయడం జరిగింది. దీంట్లో భాగంగానే పద్మాలయ పాఠశాల యాజమాన్యమైన వంశీ మోహన్ రెడ్డి గుడి నిర్మాణానికి 50వేల రూపాయలు, దోరపల్లి సత్తయ్య ముదిరాజ్ పదకొండు వేల రూపాయలు, రాంపూర్ గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి , గోపాల్ రెడ్డి అల్లుడు భుజంగారెడ్డి 10,000, సూరారం బన్నయ్య 5000లను ఆలయ నిర్మాణానికి విరాళాలుగా అందజేశారు. గుడి నిర్మాణంలో పాలుపంచుకుంటూ విరాళాలు అందజేసిన వారి కుటుంబాలకు స్వామి వారి ఆశీస్సులు ఉండాలని మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి కోరారు.



గుడి నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న దృశ్యం

## ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**వెల్దండ, మార్చి 25 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణయ్య మాట్లాడుతూ ఇందిరమ్మఇంటినిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి వచ్చేనెల 20వ తేదీ వరకు గృహప్రవేశాలు చేయాలని, గ్రామాల్లో ఇంటి టాక్స్‌లు ఈ నెల చివరినాటికి 100 వసూలుచేసి ఎన్ఆర్ఈజీఎస్ పనులలో ఎక్కువమంది కూలీ లు వచ్చే విధంగా చూడాలని, పని ప్రదేశాలలో త్రాగునీరు మెడికల్ కిట్లు, షెడ్డు, నెట్టు ఓఆర్ఎ స్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని, వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు కలగకుండా సర్పం చుల సహకారంతో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు ఏర్పాటు చేయుటకు సంబంధిత శాఖ ద్వారా వచ్చిన నమూనా పారాలను ఆయా గ్రామాల అంగన్వాడీ టీచర్ల ద్వారా తీసుకొని పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి లక్ష్మణ్, ఏపిఓ ఈశ్వర్‌జీ, హౌసింగ్ ఏఈ పల్లవి, ఈసీ దేవేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణయ్య

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**వెల్దండ, మార్చి 25 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన దొడ్ల రమేష్ సోమవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కుటుంబాని పరామర్శించి రూ.10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. అన్ని విధాలు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, ఉపసర్పంచ్ కొండల్, భీమయ్య గౌడ్, లాలయ్య, ఆనంద్ రెడ్డి, మైసయ్య, అలీల్, మొగులాల్, బాలకృష్ణ, రాములతో పాటు తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

## ఈనెల29న ఏకలవ్య 6వ తరగతి ప్రవేశ పరీక్ష

**వెల్దండ, మార్చి 25 ప్రభాతవార్త:** వెల్దండ మండలం గుండాల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఈనెల 29వ తేదీ ఆదివారం నిర్వహించబడుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క విద్యార్థి తప్పకుండా హాజరుకావాలని అన్నారు.



ప్రిన్సిపాల్ సుమన్ కుమార్

# మత్తు పదార్థాల నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలి

**గద్వాల మార్చి 25, ప్రభాతవార్త :** జిల్లాలో మత్తుపదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు సంబంధించి శాఖల అధికారులు కలిసికట్టుగా కృషిచేయాలని జిల్లాకలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మత్తు పదార్థాల నివారణ పై నిర్వహించే నార్కోటిక్స్ మీటింగ్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యా సంస్థలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నివారణపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్స్, అంగన్వాడి కేంద్రాల్లో, మహిళా సంఘాల సమావేశాల్లో కూడా డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కలిగేలా వివరించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సరఫరా అవుతున్నట్లు సమాచారం ఇచ్చే పౌరులకు రూ.10 వేల నగదు బహుమతి ఇస్తామని ప్రకటించాలన్నారు. అటవీశాఖ అధికారులు కూడా ఎవరైనా, ఎక్కడైనా గంజాయి మొక్కలు పెంచుతుంటే నిఘా ఉంచి నిర్మూలించాలన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ నివారణపై పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఈవో విజయలక్ష్మి , డిడబ్ల్యుఓ సునంద, ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, ఎక్సైజ్ అధికారి సైదిరెడ్డి, డ్రగ్ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్, అటవీ, రెవెన్యూ, వైద్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



నార్కోటిక్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు దోహదం**

నమూనా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో, నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం సహకారంతో బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమంలో జిల్లాలోని 22 పీఎం శ్రీ పాఠశాలల నుంచి 44 మంది విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా పాల్గొని తమ వాణి వినిపించారు. మానవ హక్కులు, వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ పై నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సుమారు 193 దేశాలు ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలుగా ఉన్నాయని, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అలాగే విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దవచ్చని, వారికి నాయకత్వ లక్షణాలు, వాదన నైపుణ్యాలు మరియు అంతర్జాతీయ సమస్యలపై అవగాహన కలుగుతుందన్నారు. ఇప్పటికే ఆయా దేశాల్లో బ్రిక్స్, జి20, జి8, వరల్డ్ ఎకనామిక్ ఫోరం, ఏషియన్ సమ్మిట్ వంటి అనేక సమావేశాలు వివిధ సందర్భాల్లో నిర్వహిస్తున్నారని, ఈ సమావేశాలు జరిగినప్పుడు విద్యార్థులు వాటి గురించి తెలుసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులు భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, ఇండియన్ ఫారెన్ సర్వీస్ వంటి ఉన్నత స్థాయి సివిల్ సర్వీసుల్లో చేరి దేశం తరఫున అంతర్జాతీయ స్థాయిలో జరిగే సమావేశాలకు ప్రాతినిధ్యం వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తున్నామని, జిల్లా నుంచి ఎంపికైన 11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి వెళ్లనున్నారని తెలిపారు. గద్వాల జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సైతం ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ దేశాల ప్రతినిధులుగా పాల్గొన్న విద్యార్థులు తమ దేశాల సమస్యలపై చర్చిస్తూ, మానవ హక్కులు కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. భూగోళం వేడెక్కడంతో వాతావరణ మార్పులు తిరిగి తీవ్రమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు, ప్రపంచమంతా శాంతి నెలకొనేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ, సోషల్ ఫోరం తరఫున జిల్లా కలెక్టర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో మైఖేల్, సోషల్ ఫోరం ప్రతినిధులు లక్ష్మీనారాయణ, ప్రతాప్, నరసింహులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**పెండింగ్ కేసులు సత్వర పరిష్కారం...**

**గద్వాల మార్చి 25, ప్రభాతవార్త :** పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను గద్వాల జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సెక్షన్ కోర్టు న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.రవికుమార్ అన్నారు. బుధవారం గద్వాల న్యాయస్థానంలోనీ తమ ఛాంబర్‌లో అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లక్ష్మితో కలిసి జాతీయ లోక్ అదాలత్ పై ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా కక్షి దారులు సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ సేవలు ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందించబడతాయన్నారు. గద్వాల్ లోని న్యాయస్థాన ప్రాంగణంలో ఈనెల 28న శనివారం ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం 2025లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన నాలుగు లోక్ అదాలత్‌ల ద్వారా మొత్తం 32, 854 కేసులు విజయవంతంగా పరిష్కరించబడినట్లు తెలిపారు. అలాగే నగదు సంబంధిత కేసుల్లో రూ. 5 కోట్లకు పైగా మొత్తం పరిష్కారం కుదిరినట్లు వివరించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌కు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి శ్రీ పి.సామ్ కోషి హాజరుకానున్నట్లు తెలిపారు. రాజీ పద్ధతిలో కాంపౌండ్బుల్ క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుని తమ సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు. రాజీ కుదిరితే కోర్టు ఫీజులు తిరిగి చెల్లించబడతాయని పేర్కొన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితం సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, ఇతర కేసులపై సంబంధించిన ఇరుపక్షాల సమ్మతితో రాజీతో పరిష్కారమయ్యే కేసులన్నింటినీ పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. వివిధ కారణాలతో గాయపడి లోక్ అదాలత్ కు రాలేని కక్షి దారులు కూడా ఆన్లైన్లో కనిపించి మాట్లాడినా రాజీ కుదురుచడం జరుగుతుందన్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థ ప్రతిష్టాత్మకంగా ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో పేరుకు పోయిన పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి విశేష కృషి చేస్తుందన్నారు. రాజీ మార్గం రాజమార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మెన్ ఎస్. రవికుమార్

## వెల్కిచర్లలో తైబజార్ వేలం నేడు

**భూత్పూర్, మార్చి 25, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామంలో వారం వారం జరిగే సంతలో విక్రయించే వస్తువుల తైబజార్ వేలంపాటను 26వ తేదీ(గురువారం) నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచి రమేష్, ఉపసర్పంచి గోసుల రమేష్, కాంగ్రెస్ సీనియర్ నేత పల్లె రాంరెడ్డిలు తెలిపారు. వేలంలో పాల్గొనే ఆసక్తిగల్గిన వ్యక్తులు రు.2వేల ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు. వెల్కిచర్ల సంత ప్రతీ శుక్రవారం జరుగుతుందని వారు తెలిపారు.

## అన్నాసాగర్‌లో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డి




వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డి

**భూత్పూర్, మార్చి 25, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో గ్రామ సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డి బుధవారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చక్కరి శశిబాబు ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డితో పాటు ఉపసర్పంచి భాగ్యశ్రీరమేష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి ఖాజ నాయకులు ఆల సుదర్శన్‌రెడ్డి, షాకీర్‌బాబు, శేఖర్, బోయ వసంత, చెన్నయ్య, నవీన్, ఈటె రామకృష్ణ, శ్రీను, కల్పన, శశిబా బు, యాదయ్య, బోయ రాము, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలకు 14 మంది విద్యార్థుల ఎంపిక

**కోయిలకొండ మార్చి 25, ప్రభాతవార్త :** కోయిలకొండ మండలం పారుపల్లి శ్వేతా విద్యా మందిర్ హైస్కూల్‌లో 14 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్వేతా విద్యా మందిర్ హైస్కూల్ విద్యార్థులు ప్రతి సంవత్సరం నవోదయ, గురుకుల పాఠశాలకు ఎంపికవుతూ జిల్లాలోనే ఆదర్శంగా నిలవడం జరుగుతుందన్నారు. పాఠశాలలో 18 మంది విద్యార్థులు గురుకుల పరీక్షలు రాయగా 14మంది విద్యార్థులకు గురుకుల సీట్లు రావడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో సైతం శ్వేతా విద్యామందిర్ హై స్కూల్ విజయ్ దుందుభి మోగించడం జరుగు తుందన్నారు. పాఠశాలలో 14 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపిక కావడంతో పాఠశాల ప్రిన్స్ పాల్ సుహారా, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

## ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీలత రెడ్డి

**మల్దకల్ మార్చి 25, ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన ప్రిన్సిపాల్‌గా శ్రీలత రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈమె గతంలో హైదరాబాదులోని ఎంఎఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్ గా ఉంటూ ఇటీవల పదోన్నతి పొంది మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్లకల్ జూనియర్ కళాశాలకు రావడం సంతోషంగా ఉందని తెలియజేస్తూ తిమ్మప్ప స్వామి దీవెనలతో, ప్రభుత్వ సహకారం, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, అధ్యాపకుల సహకారంతో ఈ కళాశాల అభివృద్ధికి శాయశక్తుల ప్రయత్నిస్తానని తెలియజేశారు. కావున విద్యార్థులు మరియు తల్లిదండ్రులు కూడా కళాశాల అభివృద్ధి కొరకు సహకారం అందించాలని కోరడం జరిగింది. నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ని దర్శించుకుని ఆశీస్సులు పొందడం జరిగింది. ఈ సందర్భంగా వారికి ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు శేష వస్త్రంతో సత్కరించడం జరిగింది. వారికి కళాశాల పూర్వపు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణ , జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## అమరుల త్యాగాలే యువతకు స్ఫూర్తి

**వీపనగండ్ల మార్చి 25, ప్రభాతవార్త:** ప్రస్తుతము రాజకీయాలలో అలముకున్న చీకటి విధానాలను పారద్రోలే తందుకోసం యువత అమరుల త్యాగాలను స్ఫూర్తి నింపుకోవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి అయినా వినయ్ కుమార్ రాములు యువతకు పిలుపునిచ్చారు. బుధవారం నాడు మండలంలోని బొల్లారం గ్రామంలో సిపిఎం పార్టీ నాయకుడు కావలి బాలపీరు చనిపోయిన సందర్భంగా సమస్మరణ సభ నిర్వహించారు. ఈసభకు ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. కావాలి బాలపీరు అమరత్వము ఊకే పోదని ఆయన పేద ప్రజల కోసం కుల వివక్షత కోసం పోరాడినటువంటి వ్యక్తి అని గ్రామాలలో అంబలి కేంద్రాలు పెట్టి కరువులో పేదలకు ఆకలి తీర్చినటువంటి వ్యక్తి అని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గ్రామాలలో పేద ధనిక అనే వర్గాలు లేకుండా అందరూ సమానమే అని ఆయన తెలిపారు. అందుకోసం పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేసినటువంటి వ్యక్తి అని వారు గుర్తు చేశారు. కమ్యూనిస్టులుగా జీవించాలి అంటే అది అందరికీ సాధ్యం కాదని అది కొందరు మాత్రమే సాధ్యపడుతుందని వారు అన్నారు. అంతకన్నా ముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దానితోపాటు ప్రజానాట్యమండలి కళాకారులు ఆయనపై పాటలు పాడి వినిపించారు. వీరితోపాటు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాజీ కార్యదర్శి ఎం డి జబ్బార్ జిల్లా కమిటీ సభ్యులు బాల్య నాయక్ మేకల ఆంజనేయులు , మండ్ల కృష్ణయ్య, వీపనగండ్ల మండల కార్యదర్శి దొడ్ల బాల్ రెడ్డి, గోపాల్ దీన్నే సర్పంచ్ దొడ్ల కవిత ,తెల్ల రాళ్లపల్లి రేమద్దుల సర్పంచులు, ఆ గ్రామ నాయకులు వంక కృష్ణయ్య, బాల గౌడు ,కుటుంబ సభ్యులు కృష్ణ ప్రసాద్, వెంకటస్వామి, రంగస్వామి, నాగిరెడ్డి ,సోషల్ మీడియా నాయకులు శంకర్, మాజీ సర్పంచ్ ఆర్ మోలాలి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.




బాల పీరు సంస్మరణ సభలో మాట్లాడుతున్న వినయ్ కుమార్

## అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

**ఆత్మకూర్ మార్చి25, ప్రభాతవార్త :** ఉమ్మడి ఆత్మకూరు మండలంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మింప చేస్తామని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహ మతుల్లా అన్నారు. బుధవారం రోజు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధిశాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఆధ్వర్యంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా మున్సిపల్ చైర్మన్ నాగమణి వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు తదితరులు మండలంలోని ఆయాగ్రామాలలో నూతనంగా నిర్మించినటువంటి ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలానికి ఇప్పటికే 350 ఇండ్లు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మంజూరి చేశారని మరో 1500 మంది లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు కేటాయించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆయన తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం రోజు ప్రారంభించిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత గారు చీర మరియు సారే లబ్ధిదారులకు అందజేసి ఇంటి నిర్మాణా లను ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి తులసిరాజు యాదవ్ ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగిలి గంగాధర్ గౌడ్, గాలి పంపు శ్రీనివాసులు, వెంకట నరసింహారావు, మహేష్, బుచ్చన్న, మున్సిపల్ కౌన్సిలర్లు దండు శ్రీనివాసులు, కోట్ల తిరుపతయ్య తదితరులతో పాటుగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ లబ్ధిదారులకు సారి అందజేస్తున్న దృశ్యం

## మద్యం మత్తులో యువత

**పంట పొలంలో మద్యం సీసాలు**

**వీపనగండ్ల మార్చి 25, ప్రభాతవార్త :** వీపనగండ్ల మండలంలో విచక్షణారహితంగా యువత మద్యం మత్తులో తుగుతుండగా తెల్లవాళ్లు పొద్దు మూకులు అనకుండా పంట పొలాలు యదేచ్చగ బహిరు ప్రాంతాలలో యువత తాగి మద్యం సీసాలు పంట పొలాలలో వేయడం వల్ల అవి పొలాలలో కలిసిపోయి రైతులు ప్రమాదాలకు గురవుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. వీటిపై ఎక్సైజ్ శాఖ గాని మరియు పోలీస్ యంత్రాంగం నిఘా పెట్టకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు రైతులు గురవుతున్నారు. రాత్రిపూట రోడ్ల వెంబడి మామిడి తోటలలో బహిరంగ ప్రదేశాలైన పంట పొలాలలో కూర్చొని మద్యం సేవించడం యువతకు అలవాటైపోయింది. ఏదైనా ఫంక్షన్లు జరిగిన పంట పొలాలలో మద్యం తాగి మద్యం సీసాలు పడి వేయడం వల్ల అవి పగిలిపోయి మట్టిలో కలిసి రైతులు పంట పొలాలను దున్నుతున్న సందర్భంలో వారికి గుచ్చుకొని సెప్టిక్లు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. అదేవిధంగా రోడ్ల వెంబడి కూర్చొని మద్యం సేవిస్తుండడం వల్ల రహదారుల వెంబడి పోతున్నటువంటి మహిళలకు ఆకతాయిల నుండి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు అంటున్నారు. దీనిపై యువత చిన్న చిన్న గొడవలు కూడా తాగిన మైకంలో గొడవలు పడడం జరుగుతుందని వారు వాపోతున్నారు. దీనిని అరికట్టాలని రైతులు మహిళలు కోరుతున్నారు.



పంట పొలాలలో తాగి పడేసిన మద్యం సీసాలు

## మార్చాలలో ఘనంగా సుంకిరెడ్డి జన్మదిన వేడుకలు

**కల్వకుర్తి, మార్చి 25 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామం లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్చాల గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యం లో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో భాగంగా గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందికి నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి,పండ్లు పంపిణీ చేశారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్నలను పొం దుతూన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అభిమానులు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా కల్వకుర్తి మండలంలోని రఘుపతి పేట, తాండ్ర, తిమ్మరాసిపల్లి, జిల్లెల్ల, లింగసానిపల్లి, తర్నికల్,కుర్మిద్ద, ఎల్లికట్ట,వెంకటాపూర్ గ్రామాలతో పాటు అన్ని గ్రామాల లో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అభిమానులు జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.


సుంకిరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయం

### మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్

**అయిజ మార్చి 25, ప్రభాతవార్త :** పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ పాలక వర్గ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు సమక్షంలో చైర్మన్ సీఎం సురేష్ అధ్యక్షతన 2026, 2027 బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణ సర్వతో ముఖా అభివృద్ధి కి తమ పాలకవర్గం అంకితభావంతో పనిచేస్తుందని మున్సిపాలిటీ అభివృద్ధి ప్రజాసంక్షేమం పెద్దపీట వేస్తూ కౌన్సిల్ ఏక గ్రీవ నిర్ణయం పట్టణ అభివృద్ధికి నాంది అన్నారు ఈ బడ్జెట్లో మొత్తం 1063.14 లక్షల గాను పారిశుద్ధం కి 144.50 లక్షలు,పచ్చదనం కి 91లక్షలు,పార్కులు ఆయా వార్డు ల్లో వైకుంఠ ధామాలకు70లక్షలు, వెనుకబడిన ప్రాంతాలకు 24.99లక్షలు కేటాయించామని తెలిపారు అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ బడ్జెట్ నిధులను సక్రమంగా వినియోగించి పట్టణాన్ని పారదర్శకంగా తీర్చిదిద్దాలని సూచించారు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సైదులు, వైస్ చైర్మన్ మాల నరసింహులు,ఆయా వార్డుల కౌన్సిలర్లు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## బండలాగుడు పోటీలకు ముమ్మరంగా ఏర్పాట్లు

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఈనెల 27, 28,29 లలో జరుగు క్రీడలకు గ్రౌండ్ చదును చేస్తూ పరిశుభ్రంగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు తేరు ఉత్సాహ కమిటి లో ఆధ్వర్యంలో అంతరాష్ట్ర వృషభ రాజుల చే బండ లాగుడు పోటీలు, కోలాటాలు,భజవ పోటీలు,చిడతల భజన, ట్రాక్టర్ రివర్స్ పోటీలు తదితర క్రీడలను నిర్వహించేందుకు నిర్వహించేందుకు క్రీడా ప్రాంగణాన్ని చదును చేస్తున్నారు. ఈ పోటీలకు సుదూర ప్రాంతాల నుంచి అత్యధికంగా రావడంతో ఎవ్వరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించడం జరిగిందని, ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున భారీ ఎత్తున షామియానాలు ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచు శ్రీనివాసులు వివరించారు. ఈ సంవత్సరం క్రీడలు, తేరు ఉత్సవాలు, ఉత్సాహ కమిటీ నిర్వాహకులు,అందరి సహకారంతో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## అయ్యవారిపల్లి ఆలయంలో మంచి నీటి సౌకర్యం

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త :** మండలంలోని అయ్యవారిపల్లి వేణుగోపాల్ స్వామి ఆలయ ప్రాంగణంలో మంచినీటి సౌకర్యాన్ని గ్రామ సర్పంచ్ జిల్లెల జగత్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామం నుంచి వేణుగోపాలస్వామి ఆలయ వరకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో మాట్లాడి గ్రామం నుంచి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వరకు 18 స్తంభాలు, సరిపడు ప్రత్యేక చొరవతో అందివ్వడం జరిగిందని గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి వివరించారు. విద్యుత్తు లైను, మంచినీటి సౌకర్యం ఎమ్మెల్యే తో పాటు చీమర్ల శ్రీకాంత్ రెడ్డి , గ్రామస్తుల సహకారంతో కార్యక్రమం పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ వివరించారు. గ్రామ సమీపంలో ఉన్న వేణు గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం కల్పించడంలో గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి తీసుకున్న చొరవ తోనే ఈ కార్యక్రమం పూర్తయిందని ఆయనకు ప్రత్యేకంగా గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## రేషన్ డీలర్లు ఈకేవైసి వంద శాతం పూర్తి చేయాలి

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త :** మండలంలో పనిచేస్తున్న రేషన్ డీలర్లు ఈ కేవైసీ 100 శాతం పూర్తి చేయాలని తహసీల్దార్ అద్దంకి సునీత సూచించారు.బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈసమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం అందజేయాలని, ప్రతి రేషన్ డీలర్ వంద శాతం పూర్తిచేయాలని సూచించారు. రేషన్ కార్డు కలిగిన వ్యక్తి మరణించిన, వివాహాలు చేసుకొని వెళ్లిపోయిన ఆడపడుచుల పేర్లను రేషన్ కార్డు నుంచి తొలగించాలని వివరించారు. రేషన్ డీలర్ల ఆతరైజేషన్ ఈ నెలతో ముగుస్తుందని ప్రతి ఒక్కరు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఆదాయం ఎక్కువగా ఉన్న వారి కుటుంబం వివరాలు సేకరించి కార్డును తొలగించాలని, ఎక్కడైనా తప్పుగా నమోదైన కొత్త వారి వారి గ్రామపంచాయతీ పరిధిలోకి మార్చుకోవాలని తహసీల్దార్ అద్దంకి సునీత తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ తో పాటు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పాపి శెట్టి కుమారస్వామి, కాల్వ గోవర్ధన్ రెడ్డి, ఉల్పర వెంకటయ్య, వేణుగోపాల్, గున్నామని లింగమయ్య యాదవ్, అల్లె తిరుపతయ్య, శంకర్ నాయక్, భాస్కర్ రెడ్డి, జహంగీర్,జిపిఓలు , రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## ఆఫీసులో కాదు.. గ్రామాలలో పర్యటించండి

### అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్

**చిన్న చింతకుంట,మార్చి 25 ప్రభాతవార్త :** ఆఫీసులో కాదు.. గ్రామాలలో పర్యటించాలని మండల స్థాయి అధికారులను స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాలలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. లాల్‌కోట, నెల్లికొండి, ఏదులాపూర్, చిన్న చింతకుంట తదితర గ్రామాలలో మహిళా సమైక్య భవనాల నిర్మాణాలు, ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. గ్రామాలలో సమస్యలు తెలుసుకునేందుకు మండల స్థాయి అధికారులు ఆఫీసులో ఉంటే గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎలా తెలుస్తాయన్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మండల స్థాయి అధికారులు గ్రామాలలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించాలన్నారు. పారిశుధ్యం, మంచినీటి వ్యవస్థ, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రస్తుతం జరుగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పరిశీలించి ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లోనే ఉండాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే సమస్యలు లేని గ్రామాలుగా మారుతాయన్నారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు ఎంపీడీవో లక్ష్మీ నరసింహులుకు బండర్ పల్లి లాల్ కోట, పల్లమర్రి పర్ది పూర్, నెల్లికొండి ఏదులాపూర్, ఎంపీఓ మోసిన్ కు గోపియా నాయక్ తండా, చిన్న వడ్డేమాన్, వడ్డేమాన్, దమగ్నాపూర్, సీతారాంపేట్, చిన్న చింతకుంట,ఏపిఓ నవీన్ కుమార్ కు అమ్మాపూర్ అల్లీపూర్ కురుమూర్తి మద్దూర్ గూడూర్ ఉంధ్యాల గ్రామాలకు స్పెషల్ అధికారులుగా వ్యవహరిస్తారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు, ఆయా గ్రామాల సర్పంచులు మానస దశరథ్, గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు ఉన్నారు.


భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

## వెల్టూర్ విద్యుత్ లైన్ల ఏర్పాటు కోసం గ్రామంలో సర్వే

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామంలో విద్యుత్తు లైన్ ఏర్పాటు కోసం బుధవారం గ్రామంలో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, విద్యుత్ అధికారులు గ్రామంలో ఉన్న పరిస్థితులను పరిశీలించారు. కావలసిన నూతన స్తంభాలు, రోడ్డు అడ్డంగా ఉండి ప్రజలకు అసౌకర్యంగా ఉన్న విద్యుత్తు లైన్ తొలగించాలని పరిశీలించారు. గ్రామంలో త్వరితగతిన నూతనంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా ప్రణాళికతో పనులు పూర్తి చేసేందుకు సర్వే నిర్వహించారు. వీలైనంత తొందరగా నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని వార్డు సభ్యులు , గ్రామస్తులు గ్రామ సర్పంచును కోరారు. ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న ఈ సమస్యను సత్వరమే పరిష్కరిస్తారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్‌తోపాటు విద్యుత్ అధికారులు,ఉప సర్పంచ్ ఉప్పరి మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఉమా శంకర్, వార్డు సభ్యులు నరేష్ యాదవ్, గుద్దటి బాలరాజు, సాయిబాబు, నాగరాజు, నాయకులు కృష్ణ, సమ్మద్‌లు ఉన్నారు.

# నేటి నుంచి శ్రీరామనవమి వేడుకలు

**ఉప్పునుంతల,మార్చి 25 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ కేదారేశ్వర చెన్నకేశవ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవా లు నేడు 26గురువారం నుంచి శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు తెలిపారు. నేడు 26 న గురువారం సాయంత్రం 6 గంటలకు ఎదుర్కోలు,27 న శుక్రవారం ఉదయం 11గంటలకు శ్రీ సీతారామ కళ్యాణం, అనంతరం మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సూరం అరుణమ్మ నారాయణరెడ్డి ల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4గంటలకు కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచు, ఉత్సాహ కమిటి నిర్వాహకులు, గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు తెలిపారు.కోలాటం పోటిలో గెలుపొందిన విజేతలకుదాత కొత్త హనుమంతు రెడ్డి ఆర్థిక సహకారంతో మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి దేవస్థాన కమిటీ చైర్మన్ కట్ట నారాయణ రెడ్డి రూ.20 వేలు, తృతీయ బహుమతి పాత్కుల రామచంద్రయ్య రూ. 15 వేలు, దీంతో పాటు పాల్గొన్న అన్ని జట్లకు ప్రోత్సాహక బహుమతి రూ.3 వేలు కమిటీ వారు అందజేయనున్నట్లు వారు తెలిపారు.28న శనివారం వేకువజామున 5 గంటలకు రథోత్సవం (తేరు) కార్యక్రమం ఉంటుందని వివరించారు.అనంతరం ఉదయం 9గంటలకు ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.7,500లు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు మంజునాథ్ ట్రాక్టర్స్ అసోసియేషన్ ఉప్పునుంతల వారి సౌజన్యంతో విజేతలకు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు హాజరైన భక్త జనులకు ఎడ్ల నరేష్ యాదవ్ పద్మావతి ఇండస్ట్రీస్ లత్తిపూర్ వారి సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.28 న మధ్యాహ్నం 3 గంటల నుంచి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. భజన పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్వర్గీయ నామని భాగ్యమ్మ జ్ఞాపకార్థం ఆమె తనయులు నామని రామచంద్రయ్య, నామని రాంగోపాల్ సౌజన్యంతో మొదటి బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి 5 వేలు విజేతలకు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు వారు తెలిపారు. అదే రోజు సాయంత్రం చిడుతల భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేలు సూరం వెంకట్ రెడ్డి ( విశ్రాంత ఉపాధ్యాయులు), ద్వితీయ బహుమతి రూ.15 వేలు శ్రీరామ తాపీ మేస్త్రీసంఘం ఉప్పునుంతల వారిచే అందజేత, తృతీయ బహుమతి రూ.10 వేలు మేకల రామచంద్రయ్య (మేస్త్రీ) చే అందజేత.29న ఆదివారం ఉదయం 10 గంటలకు అంతరాష్ట్ర స్థాయి లో వృషభ రాజుల చే బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ పోటిలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి దాత మాజీ సర్పంచ్ కట్ట సరితానంత రెడ్డి రూ.80 వేలు అందజేయగా, ద్వితీయ బహుమతి మదనాగుల మహేందర్ ( పిరట్వాన్ పల్లి)రూ.60 వేలు, తృతీయ బహుమతి బాలు ఎలక్ట్రానిక్ పుట్ వేరు ప్రొపైటర్ బొల్లె బాలయ్య చే రూ.40 వేలు అందజేత,నాలుగో బహుమతి కట్ట జనార్దన్ రెడ్డి (తూర్పు) చే రూ. 30 వేలు అందజేత, ఐదో బహుమతి తాండ్ర మల్లేష్ చే రూ.20 వేలు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4గంటలకు ముగింపు సమావేశం , విజేతలకు బహుమతులు ప్రదానం అందజేయడం జరుగుతుందని సర్పంచు,కమిటీ నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకు ళ్ళ దామోదర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జిల్లా ఉపాధ్యక్షుడు , మాజీ సర్పంచ్ కట్ట సరితానంత రెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, కొత్త పెద్ద జంగి రెడ్డి లు హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలు, క్రీడలు ముగిసేంత వరకు ప్రజలకు దాహార్తి నీ తీర్చడానికి తాగునీరు సరఫరా ఉప్పునుంతల శ్రీ ఆంజనేయ వాటర్ కూలింగ్ వాటర్ ప్రొఫైటర్ మద్ది తిరుపతయ్య గౌడ్ అందజేయనున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలు, క్రీడలు ముగిసిన వెంటనే క్రీడా ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయడానికి తాండ్ర శివయ్య సౌజన్యంతో పూర్తి చేయనున్నట్లు వారు వివరించారు.


బహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీ కేదారేశ్వర ఆలయం

## రావులపల్లిలో యువకుడి ఆత్మహత్య

**భూత్పూర్,మార్చి 25,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం రావు లపల్లిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన బుధవారం చోటుచేసుకుంది.భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం రావులపల్లి గ్రామానికి చెందిన మహమూద్ పాషా(19) మంగళవారం సాయంత్రం ఇదేగ్రామానికి చెందిన తన స్నేహితులైన మహేష్,నందు,అజయ్,కె.శివ,ఎం,శివలతో కలిసి వెళ్లి రాత్రి 9గంటలకు ఇంటికి మహేష్ బైక్‌పై ఇంటికి వ చ్చాడు.అప్పటికే మహమూద్ పాషా తప్పతాగి ఉన్నట్లు మృతుని తల్లి హసీనాబేగం పీఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొందని ఎస్సై తెలిపారు.అయితే గదిలోకి వెళ్లిన మహమూద్ పాషా ' ఐ మిస్‌యు అమ్మ,అక్క,అన్న'అని ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్‌ను తన అన్న సమీర్‌పాషా ఫోన్‌కు పెట్టినట్లు మృతుని స్నేహితులలో ఒకడైన నందు ఫోన్ ద్వారా సమీర్‌పాషాకు సమాచారం ఇవ్వగా,సమీర్‌పాషా వెంటనే ఇంటికి చేరుకుని తమ్ముడు మహమూద్ పాషా ఎక్కడని తల్లి హసీనాబేగంను అడుగగా,లోపలి రూంలో ఉన్నాడని చెప్పగా,ఆనుమానం వేసిన తల్లీకొడుకులు లోపలి రూం తులుపులు బద్దలు కొట్టి చూడగా,మహమూద్ పాషా ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని వేలాడిపడి ఉన్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.వెంటనే మహమూద్ పాషాను జిల్లా ఆసుపత్రికి తరలించగా,అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారని తెలిపారు.మృతుని తల్లి హసీనాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.మృతుడు మహమూద్ పాషా ఓ అమ్మాయి ప్రేమలో పడి విఫలం కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.ఇది మృతుని తల్లి పీఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొందని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన రిటైర్డ్ ఉద్యోగులు

**గద్వాల మార్చి25, ప్రభాతవార్త :** రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనా లకు భద్రత కల్పించాలని బుధవారం రిటైర్ ఉద్యోగులు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము గత సంవత్సరము మార్చి 25వ తారీఖున ఫైనాన్షియల్ వాలిడేషన్ ఆఫ్ సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షనర్స్ బిల్లును గౌరవ లోకస భలో ఆర్థిక బిల్లుతోపాటు ఇది తీర్మానం పొందిందని, దీనివలన 112026 ముందు రిటైర్ అయిన ఉద్యోగులకు ఇకపై పిఆర్సి వలన ఏర్పడే ప్రయోజనాలు, డీఏ పెంపుదల ప్రయోజనాలు ఉండవని తెలియజేశారని, దీంతో రిటైర్ అయిన ఉద్యోగస్తులలో వర్గాలు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. మన దేశ ప్రధాని నరేంద్ర మోడీకి ఆ బిల్లును అమల్లోకి తీసుకురాకూడదని పెన్షనర్స్ అందరూకూడా రాష్ట్ర నాయకత్వం ఆదేశానుసారము నల్లబ్యాడ్జీలతో మెమరాండమును జిల్లా కలెక్టరుకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు లక్ష్మి రెడ్డి, చక్రధర్ ప్రధాన కార్యదర్శి,కృష్ణారెడ్డి కార్యదర్శి, సత్యనారాయణ,నర్సింహులు, వెంట్రామయ్య, మహేష్ ఉపాధ్యక్షులు ,పండరి నాథ్,వీరభద్రప్ప రిటైర్డ్ తాసిల్దార్ బస్వరాజు,హనుమంతు, పరమేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

## వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

**గద్వాల మార్చి 25, ప్రభాతవార్త :** జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్యలు ఉత్పన్నమవకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో తాగునీటి సరఫరా పనులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై ఐడిఓసి సమావేశపు మందిరంలో బుధవారం సాయంత్రం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ ఒకటి నుంచి 15 వరకు అందుబాటులో ఉన్న నిధులతో చేతి పంపులు, సమస్య ఉన్న మోటర్లు, పైప్ లైన్స్, తదితర మరమ్మత్తులు చేయించాలన్నారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు వస్తే పరిష్కరించేందుకు వాటర్ ఇన్స్పెక్షన్ టీములను ఏర్పాటు చేయాలన్నారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలోనూ సంబంధిత అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. నీటి సరఫరాపై ఆయా ప్రాంతాలవారీగా సమస్య వస్తే ముందుగానే ప్రజలకు సమాచారం అందించాలన్నారు. ఇక్కడ ట్యాంకర్ లతో నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా మండలాల వారీగా తాగునీటి సరఫరాకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు తనకు రిపోర్ట్ పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, కార్యాలయాల శుభ్రతపై ఆదేశాలు జారీ చేసినప్పటికీ చాలా చోట్ల చేయలేదని, త్వరలో తాను ఆయా మండలాలలో పర్యటిస్తానని, సమస్యలు కనిపిస్తే చర్యలు చేసుకుంటామని హెచ్చరించారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించాలన్నారు. గ్రామ సభల్లో వివిధ శాఖల సిబ్బంది, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలను భాగస్వాములు చేస్తూ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాలన్నారు. గ్రామసభల్లో చర్చించాల్సిన 16 ఆజెండా అంశాలను, వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, డిపిఓ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్,డిజిల్ ఎల్.పి.జి. కొరత లేదు

**గద్వాల మార్చి 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ల్.పి.జి కొరత ఉత్పన్నమయ్యే ప్రసక్తేలేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానంగా హైదరాబాద్‌లో డీజిల్,పెట్రోల్ బంక్ ల వద్ద పెద్ద ఎత్తున ఉన్న క్యూలను చూసి పెట్రోల్,డీజిల్,ఎల్. పి.జి కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ఇంధన వనరులతో పాటు ఎల్.పి.జి కొరత అంటూ వస్తున్న వదంతులతో ప్రజాలేవరు గందరగోళంలో పడొద్దని ఆయన ఉద్బోధించారు.ఈ మేరకు రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు.రానున్న మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయని జరుగుతున్న వదంతులతో ఏ ఒక్కరూ అయో మయంలో పడొద్దని ఆయన ఉద్బోధించారు.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌తో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీలు ఇంధన సరఫరాలను గణనీయంగా పెంచాయని ఆయన పేర్కొన్నా రు.డిమాండ్ ను మించి సరఫరా కొనసాగుతోందని,ఈ రోజు 17,246 కిలో లీటర్ల డిమాండ్ ఉండగా 17,898 కిలోలీటర్ల సరఫరా జరగడమే ఇందుకు నిదర్శనమన్నారు.అంటే 652 కిలో లీటర్ల అదనపు నిల్వ మిగిలిందన్నారు.దీనికి తోడు అదనంగా 16,000 కిలోలీటర్ల ఇంధనం నిల్వ ఉంచడంతో పాటు 1200 అదనపు ట్యాంకర్లను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. వినియోగదారులు గందరగోళంలో పడి పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేయడంతొ రోజు వారి డిమాండ్ ఒక్కసారిగా 25 పెరిగినా రోజువారీ సరఫరాలో సగటున పోల్చిచూసినపుడు కుడా ఎక్కడా అంతరాయం కలుగ కుండా అదనంగా 22 అందుబాటులో ఇంధన వనరులు నిల్వలు ఉన్నాయని ఆయన తెలిపారు.అయితే కొన్ని పెట్రోలు బంక్ లకు నిర్ణిత సమయానికి ట్యాంకర్లు చెరుకోక పోవడంతో ఆయా బంక్ లలో నోస్టాక్ బోర్డులు వెలుస్తున్నాయన్నారు. వాస్తవంగా మాత్రం ఎంత మాత్రం కొరత లేదని ఆయన పునరుద్ఘాటించారు.అయితే అదే సమయంలో షికార్లు చేస్తున్న పుకార్లను నమ్మి వినియోగదారులు కంటైనర్లలో,డబ్బాలలో పెట్రోల్, డీజిల్ని తీసుకెళ్లడం పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్య అని అంత కుమించి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. పెట్రోలియం నిలువలు రానున్న 65 రోజులకు సరిపడా ఉన్నాయ ని,సరఫరాలో ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేలా నిరంతరం కొన సాగేందుకు వీలుగా వీ.బి.ది లైన్ ను విస్తరించిన ట్లు ఆయన వెల్లడించారు.రాష్ట్ర రాజధానిలో 596 పెట్రోల్ బంక్ లు నిరంతరాయంగా పని చేస్తున్నాయని,హైదరాబాద్‌తో పాటు రాష్ట్రం లో ఎక్కడ కుడా కొరత లేదని,అహ్మదాబాద్, సూరత్,బెంగుళూరు, ధారవాడ ,బెల్గాం వంటి నగరాలలో కూడ ఇదే పరిస్థితి ఉత్పన్నమయ్యాయన్నారు.ఎల్.పి.జి విషయంలో ఎటువంటి కొరత లేదని, కాకపోతే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంతమేర సమస్య ఉన్నట్లు గుర్తించమన్నారు.ఇదే సందర్భంలో అక్రమంగా వినియోగిస్తున్న 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.పెట్రోల్,డీజిల్ గృహ వినియోగదారులకు అవసరమైన ఎల్.పి.జి సమృద్ధిగా అందుబాటులో ఉందని,ప్రజలేవరు అయోమయానికి గురి కావొద్దని, వదంతులను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మొద్దని రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

**నిత్యావసర వస్తువులపై ఆందోళన పడొద్దు...**

**వదంతులను నమ్మొద్దు...**

**రాష్ట్ర ప్రజలకు మంత్రి**

**కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధ**

## షెడ్యూల్ కులాల నుంచి దరఖాస్తుల స్వీకరణ : ఎంపిడీఓ

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త :** 2025,26 సంవత్సరానికి మండలంలో షెడ్యూల్ కులాల కు చెందిన నిరుద్యోగ యువతి, యువకులు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ రేవతి రెడ్డి పేర్కొన్నారు. షెడ్యూల్ కులాల వారు ద్విచక్ర వాహనం, త్రిచక్ర వాహనం, సోలార్ పంపు సెట్టు తోపాటు వ్యవసాయ సెక్టార్ స్కీములు, పాడి పరిశ్రమ, హార్టికల్చర్ తదితర స్కీముల కు సంబంధించి బ్యాంకుల ద్వారా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, షెడ్యూల్ కులాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఓ రేవత్ రెడ్డి తెలిపారు. రుణాలు బ్యాంకు ద్వారా ఇవ్వడానికి షెడ్యూల్ కులాల కు చెందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవడానికి కొంత సమయం పొడిగించడం జరిగిందని, మండలంలో షెడ్యూల్ కులాలకు చెందిన వారు వచ్చేనెల ఏప్రిల్ 2 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ రేవతి రెడ్డి సూచించారు.

### గురుకులం ఫలితాలలో

## మెరిసిన ఆణిముత్యాలు

**నవాబుపేట,మార్చి 25 ప్రభాతవార్త :** నిన్న మంగళవారం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గురుకులాల ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో మండల పరిధిలోని కూచూరు గ్రామానికి చెందిన కర్రె రాహుల్ సిద్ధార్థ్ ఓపెన్ కేటగిరి ఫస్ట్ పేజ్ గురుకులం ఫలితాలలో ఐదవ తరగతి సీటు సాధించడంతో బంధు మిత్రులు, గ్రామస్తులు రాహుల్ సిద్ధార్థను అభినందించారు. విద్యార్థి తల్లిదండ్రులు నవాబుపేట మండల వార్త రిపోర్టర్ శేఖర్ శమంత కుమారుడికి సీటు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. కూచూరు గ్రామ వాసికి గురుకులాలలో సీటు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రవేశ పరీక్ష లో ప్రతిభా చాటుకున్న మైల్ స్టోన్ స్కూల్ విద్యార్థులు

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త :** తెలంగాణ గురుకుల సెట్ 2026 సంవత్సరానికి ప్రవేశ పరీక్ష ఫలితాలలో మైల్ స్టోన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో నడుస్తున్న మైల్ స్టోన్ స్కూల్ కు చెందిన విద్యార్థులు 25 మంది పరీక్షలకు హాజరు కాగా 15 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష ఫలితాలలో అర్హత సాధించారు. 5 వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో విద్యార్థులు అత్యధికంగా విజయం సాధించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్ని కృష్ణన్, యాజమాన్య బృందం పొన్నగంటి దేవేందర్ రెడ్డి, బొల్లంపల్లి ఏడుకొండలు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## పెట్రోల్, డీజిల్ కొరత లేదు :ఎస్ఐ

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఇంధనం కొరత ఉందంటూ వస్తున్న పుకార్లు నమ్మ కూడదని, పెట్రోల్, డీజిల్ కొరత లేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్ఐ వెంక రెడ్డి సూచించారు. చందన సంస్థల నుంచి పెట్రోల్ బంకుల కు నిరంతరాయం లేకుండా సరఫరా చేస్తుందని కొంతమంది పని కట్టుకొని పుకార్లు లేపుతున్నారని అట్టి పుకార్లను నమ్మకూడదని ఎస్ఐ హెచ్చరించారు. సోషల్ మీడియాలో పుకార్లు ప్రచారం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని, తప్పుడు ప్రచారాలను నమ్మకూడదని ప్రజలకు సూచించారు.

## పెనిమిళ్ళలో సిసి రోడ్డు పనులు

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త :** మండలంలోని పెనిమిళ్ళ గ్రామంలో బుధవారం సి సి రోడ్డు పనులు ప్రారంభించారు. 3వ వార్డులో మాధవ స్వామి గుడి నుంచి సిబి తాండకు వెళ్లే రోడ్డు వరకు 126 మీటర్ల సిసి రోడ్డు పనులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షల వ్యయంతో చేపట్టబోయే పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎఇ మహేష్, నాయకులు మెడసాని విజేందర్ రెడ్డి, మారం విజయపాల్ రెడ్డి, వార్డు సభ్యులు సుధాకర్,ఎస్‌కె సజ్జు, నాగరాజు, ఉషన్న, తిప్పర్తి శేఖర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇసుక టాక్టర్ల తనిఖీ

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త :** మండలంలోని మొల్గర గ్రామ శివారు లో ఉన్న ఇసుక రీచ్ నుంచి ఆన్లైన్ ద్వారా సరఫరా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ల అనుమతి పత్రాలను బుధవారం ఉప తహసీల్దార్ రమేష్ నాయక్ పరిశీలించారు. ఆన్లైన్ కాకుండా ఆన్లైన్ మాటున అక్రమంగా ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదని ఉప తహసీల్దార్ ట్రాక్టర్ యజమానులకు హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా అనుమతి లేకుండా ఇసుకను తరలించినట్టు తెలిస్తే ట్రాక్టర్ సీట్ చేయబడుతుందని హెచ్చరించారు.ఉప తహసీల్దార్ తో పాటు రెవెన్యూ సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

## మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి

### మాజీ జెడ్పి చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి

**చిన్న చింతకుంట, మార్చి 25 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధిలో రాణిస్తే ఆర్థికంగా ఎదుగుతారని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ధమగ్నాపూర్ గ్రామంలో ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ కేంద్రాన్ని ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత మధుసూదన్ రెడ్డితో కలిసి జడ్పీ చైర్‌పర్సన్‌లు ప్రారంభించారు. గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న సంకల్పమే ఈ ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉచిత కుట్టు మిషన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కవితా మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ హజమ్మ, మండల కోఆర్డినేటర్ ఎల్లప్ప, పాటు హెల్త్ వర్కర్స్, మహిళలు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

**అంగన్‌వాడీ భవనాల పరిశీలన:** పెబ్బేరు మండల కేంద్రంలోని హరిజన వాడ, చెలిమిల్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద ఏబీడీ లిక్కర్ సంస్థ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన అంగన్‌వాడీ భవనాలను సందర్శించారు. శ్రీరంగాపురం, పెబ్బేరు మండలాల పరిధిలో 10 అంగన్‌వాడి సెంటర్లను రూ.35 లక్షల వ్యయంతో వీరు సీఎస్ఆర్ కింద పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. ఈభవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోషకాహారలోపంతో ఉన్న పిల్లలు ఎవరూ లేకుండా చూడాలని, అవసరమైన పిల్లలను ఎన్ఆర్‌సికు పంపించి సాధారణ స్థితికి తీసుకురావాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు.

**ఖేలో ఇండియా క్రీడ మైదానాన్ని పరిశీలించిన కలెక్టర్:** పెబ్బేరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఖేలో ఇండియా ఫుట్‌బాల్ మైదానాన్ని కలెక్టర్ పరిశీలించారు. మైదానంలో కలెక్టర్ రూ. 10 లక్షల తన సొంత నిధులతో కొత్తగా ఏర్పాటు చేయించిన హైమాస్ట్ లైట్లను తనిఖీ చేశారు. త్వరలోనే వీటి ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని క్రీడాధికారికి ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారిని సుధారాణి, డివైఎస్ఓ సుధీర్ రెడ్డి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిసిడిఓ శుభ లక్ష్మి, పెబ్బేరు తహసిల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఏబీడీ సంస్థ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్‌ను సన్మానించిన సర్పంచ్

**దేవరకద్ర, మార్చి 25 ప్రభాతవార్త:** మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డిని మండల సర్పంచ్ చెన్నయ్య మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాలతో సత్కరించి, శాలువతో ఘనంగా సన్మానం చేశారు. అదేవిధంగా వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, సర్పంచ్ కు శాలువాతో సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ అభివృద్ధి కోసం మున్సిపల్ వైస్ చైర్మన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రజల సమస్యలపరిష్కారంలో ఆయనచురుకైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ స్పందిస్తూ తనపై చూపిన గౌరవానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిక్కి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలింపు

**దామరగిద్ద, మార్చి 25 ప్రభాతవార్త :** కర్నాటక రాష్ట్రానికి చెందిన సేడంకర్ పుణ్యవంత తండ్రి శానప్పకు చెందిన బొలెరో వాహనం (కెఎ 33 ఎ 5324) లో గుర్మిట్కల్ నుండి కోస్గి వైపు అక్రమంగా పిడిఎస్ బియ్యం, నూకలను తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. దామరగిద్ద పోలీస్ స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో సుమారు 7 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం, నూకలు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన బియ్యంవిలువ సుమారు రూ. 30,800గా అంచనా వేశారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సీఎం సోదరుడు



కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న సీఎం సోదరుడు

**మద్దూరు, మార్చి25 ప్రభాతవార్త:** ఉమ్మడి మద్దూరు మండల పరిధి లోని కొత్తపల్లిలో బుధవారం రోజు తహశీల్దార్ కార్యాలయం నందు 33 కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, కాడ వెంకటరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌వార్ల విజయకుమార్, కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సర్పంచ్ చెన్నప్ప, పార్టీ సీనియర్ నాయకులు నిర్జింత తిరుపతి రెడ్డి, సంజీవ్, రమేష్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు చెన్నప్ప, పార్టీ నాయకులు తహశీల్దార్ జయ రాములు తదితరులు పాల్గొన్నారు.

## సౌర శక్తిపై అవగాహన పెంచాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 25, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పి.ఎం. సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారాసౌరశక్తి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పైకప్పులపై సోలార్ పలకలను ఏర్పాటు చేసుకొని, అవసరమైన విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని, హరిత ఇంధన వినియోగాన్ని పెంచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోలార్ వ్యవస్థల ద్వారా ఇంటి అవసరాలకు మించి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం పొందే అవకాశమూ ఉందని తెలిపారు. కార్యక్రమంలో టిజి రెడ్‌కో డి.ఎం.కె మనోహర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ కె.భాస్కర్‌లు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం..

### దేవరకద్ర ఎమ్మెల్యే సతీమణి



**దేవరకద్ర, మార్చి 25 ప్రభాతవార్త:** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దేవర కద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా బుధవారం దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో కురవ పద్మమ్మ చంద్రయ్య గారి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి, పాల్గొని, ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి మాట్లాడుతూ నిరుపేదలకు సొంత గూడు కల్పించాలనే ఉన్నత ఆశయాలతో, ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని, అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం కావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిజమైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే సతీమణి భరోసా ఇచ్చారు. స్థానిక గ్రామ ప్రజలు జిఎంఆర్ చేసిన సేవలను అభినందించారు. సొంత ఇల్లు లభించడంతో ఇందిరమ్మ లబ్ధిదారులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి, సతీమణి కవిత మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కురవ జయమ్మ రాములు గారి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసంనిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున కొత్త (బట్టలు పెట్టి) నూతన వస్త్రాలు ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ రెడ్డి, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలి

● అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్

**దేవరకద్ర, మార్చి 25 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని, గ్రామ పంచాయితీల పాలకవర్గం ఎలాంటి విభేదాలు లేకుండా ఏకాభిప్రాయంతో ముందుకు సాగితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. కౌకుంట్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో రెండవ రోజు నిర్వహించిన వార్డు సభ్యులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ హాజరై మాట్లాడుతూ వార్డు సభ్యులకు పలుసూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందించడంలో వార్డు సభ్యులు ముందుండాలని సూచించారు. గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రజలతో సమన్వయం పెంచుకొని పారదర్శకంగా పాలన సాగించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సభ్యులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వర్తించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ప్రతి వార్డు సభ్యులు సమిష్టిగా ఉంటూ, గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను వినియోగించుకోవాలని మధుసూదన్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, పంచాయతీ కార్యదర్శులు అశోక్, పవన్, నాగిరెడ్డి, వార్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన కొరతపై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

● మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ హెచ్చరిక



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 25, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఏమీ లేదని జిల్లా ఎస్పీ డి.జానకి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురై, ఒకేసారి పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాలకు ఫుల్ ట్యాంక్ నింపుకొనే ప్రయత్నం చేయడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతున్నదని తెలిపారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్నదని ఎస్పీ తెలిపారు. ఇంధన కొరతకు సంబంధించిన ఎలాంటి పరిస్థితి లేదని, ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని సూచించారు. అలా చేయడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంఅవుతున్న అసత్య సమాచారం, వదంతుల ను నమ్మవద్దని, నిర్ధారణ చేయని సమాచారాన్ని ఇతరులకు పంపించడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సాధారణ అవసరాల మేరకే ఇంధనాన్ని వినియోగించుకోవాలని, ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని కోరారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. వదంతులు వ్యాప్తి చేసేవారిపై, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్ప డేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# స్పెషల్ బ్రాంచ్ పనితీరు ప్రశంసనీయం

- సమాచార సేకరణ, నేర నియంత్రణలో కీలక పాత్ర
- స్పెషల్ బ్రాంచ్ మరింత సమర్థవంతంగా పనిచేయాలి
- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి, మార్చి 25 ప్రభాతవార్త :** స్పెషల్ బ్రాంచ్ విభాగం జిల్లా పోలీస్ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోందని, క్షేత్రస్థాయిలో సిబ్బందికి అవసరమైన సమాచారాన్ని అందిస్తూ నేర నియంత్రణలో ముఖ్యమైన సహకారం అందిస్తోందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి స్పెషల్ బ్రాంచ్ విభాగం పనితీరును ప్రశంసిస్తూ, మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పెషల్ బ్రాంచ్ విభాగం జిల్లా భద్రతా వ్యవస్థలో కీలక స్థంభం స్పెషల్ బ్రాంచ్ అందిస్తున్న సమాచారంతో నేరాలను ముందుగానే అడ్డుకోవడం సాధ్యమవుతోంది. ఇదే ఉత్సాహంతో మరింత క్రమశిక్షణతో, పారదర్శకతతో పని చేస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి. ప్రతి పని సమయానికి పూర్తి చేయడం ద్వారా పోలీసుశాఖపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందని పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియ, ఉద్యోగ వెరిఫికేషన్లు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ల జారీ, ఇతర విభాగాలకు సమన్వయంతో సహకారం అందించడం అన్ని అంశాల్లో స్పెషల్ బ్రాంచ్ పనితీరు ప్రశంసనీయమనిఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఎస్సై రామేశ్వర్‌రెడ్డి ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



కొలువుదీరిన నూతన పాలకవర్గం

**నారాయణపేట, మార్చి 25 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొండా శ్వేతా సత్యా యాదవ్, వైస్ చైర్మన్‌గా మంజుల రాఘవేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అధికారికంగా నిర్వహించబడింది. పార్టీ పరంగా భారీ స్థాయిలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించాలని భావించినప్పటికీ, వివిధ కారణాలతో సుమారు నెల రోజుల పాటు వాయిదా పడుతూ వచ్చిన ఈ కార్యక్రమం చివరకు సాదాసీదాగా జరిగింది. రాష్ట్రంలోనే బీజేపీ అధీనంలో ఉన్న ఏకైక మున్సిపాలిటీగా నారాయణపేట ప్రత్యేక స్థానం కలిగి ఉండటంతో, రాష్ట్ర స్థాయినాయకులు, ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో అట్టహాసంగా నిర్వహించాలని యోచించారు. అయితే అనుకున్న విధంగా కాకుండా సరళంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నాగరావు నామాజీ, రతన్ పాండురెడ్డి, అలాగే కాంగ్రెస్‌పార్టీ మాజీ డీసీసీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు. బిజెపి కాంగ్రెస్ ఎంఐఎం కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఉదయం పూజ కార్యక్రమం అనంతరం నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేసి అధికార బాధ్యతలు స్వీకరించారు.

# ఘనంగా లయన్స్ క్లబ్ 48వ వార్షికోత్సవం

**నారాయణ పేట, మార్చి 25 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఒక వ్యక్తి సంకల్పం, కృషి, పట్టుదలతో ప్రారంభమైన లయన్స్ క్లబ్ నేడు మహా వృక్షంగా ఎదిగి పేదలకు నిరంతరం సేవలు అందించడం గర్వకారణమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ జి. మహేంద్రకుమార్ రెడ్డి, సుప్రీం కోర్టు న్యాయవాది దీపక్ బట్టాచార్య అన్నారు. ఎస్సార్ గార్డెన్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ 48వ వార్షికోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి ఆర్డీవో కేవీ రమణ పిలుపు మేరకు పట్టణానికి చెందిన హరి నారాయణ్ బట్టడ్ లయన్స్ క్లబ్‌ను స్థాపించి, నిరంతర సేవా కార్యక్రమాలతో అభివృద్ధి పథంలో నడిపిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఈ సందర్భంగా బాలాజీ గోల్డ్ సిల్వర్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ సరిత హరి నారాయణ్ బట్టడ్ రూ.25 లక్షల సిఎస్ఆర్ నిధులతో విద్య, వైద్యం, వృద్ధాప్య, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, మహిళలు, అనాధ పిల్లలకు మొత్తం 302 సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శ్యాసన్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బూట్లు, సాక్స్ పంపిణీ చేయడంతో పాటు అనాథాశ్రమం, వృద్ధాశ్రమాలకు వస్త్రాలు అందించారు. కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధి లేని మహిళలు, యువతులకు 100 టైలరింగ్ మిషన్లు పంపిణీ చేశారు. చిరు వ్యాపారస్తులకు పెద్ద గొడుగులు, 25 మందికి సైకిళ్లు ఇచ్చారు. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ చదువుతున్న ముగ్గురు పేద విద్యార్థులకు రూ.1.65 లక్షల ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, లయన్స్ క్లబ్ పాస్ట్ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి, వైస్ డిస్ట్రిక్ గవర్నర్ సురేష్ జిజ్ఞాని, సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ శశికాంత్, రీజన్ చైర్మన్ పరిటాల రాము, జోన్ చైర్మన్ ఉమాకాంత్ గందె లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చి.. నెరవేర్చి..

**వారంలోనే మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు**

**డిప్యూటీ మేయర్, ముడా చైర్మన్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు**

**మహబూబ్‌నగర్, మార్చి 25 ప్రభాతవార్త :** పాఠశాల ఆవరణలో చీకటిగా ఉంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం అంటూ విద్యార్థులు తమ సమస్యను డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వారంలోనే ముడా నిధులతో లైట్లను ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని న్యూ బాలాజీనగర్‌లో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు)లో గత వారం రోజుల క్రితం ఇఫ్తార్‌లో పాల్గొన్నప్పుడు రెసిడెన్షియల్ ఆవరణంలో మొత్తం చీకటిలో ఉందని రెసిడెన్షియల్ యజ్యమానం, విద్యార్థులు తెలపడంతో వెంటనే ముడా నిధులతో రెసిడెన్షియల్ స్కూల్‌లో రెండు హైమాస్ట్ లైట్‌లు ఏర్పాటు చేశారు. ఈ మేరకుబుధవారం మహబూబ్‌నగర్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్, ముడా చైర్మన్

## మహిళా సంఘాలకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం

**నవాబుపేట, మార్చి25 ప్రభాతవార్త:** మహిళ సంఘాల భవనాలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తోందని హస్లాపూర్ సర్పంచ్, గ్రామ నాయకులు అన్నారు. గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున నిధులతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి బుధవారం గ్రామ నాయకులు పంచాయతీ అధికారుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అజిలాపూర్ సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నూతన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రేవంతరెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మహిళలు ఆత్మ గౌరవంగా ఉండాలని మహిళా సంఘాల భవనాలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించిందన్నారు. నిరుపేదలకు సొంతింటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో, హాజిలాపూర్ సర్పంచ్ గొల్ల పద్మమ్మ డిప్యూటీ సర్పంచ్ వర్క్య లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజగోపాల చారి, గ్రామ ప్రజా ప్రతినిధులు పాండు, నాయక్ వెంకటేష్ శేఖర్, ఆంజనేయులు గంగన్న తిరుపతయ్య వాద్య రమేష్ తదితరులు ఉన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

**జడ్చర్ల, మార్చి 25 ప్రభాతవార్త, :** భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ ప్రత్యేకత అని, మన సంప్రదాయాలను గౌరవిస్తూ శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో భక్తిభావంతో పండుగలను నిర్వహించుకోవాలని మహబూబ్‌నగర్ డి.ఎస్.పి వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. జడ్చర్ల పోలీస్ స్టేషన్లో సిఐలు కమలాకర్ నాగార్జున ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతియుత, ఆనంద వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉగాది, రంజాన్ పండుగలు శాంతియుతంగా జరుపుకున్నామని తెలిపారు.

## ఆన్లైన్ ద్వారానే ఇసుక..

(మొదటి పేజీ తరువాయి)

వివరాలతో సిద్ధం గా ఉండాలని ఆదేశించారు. మీడియా లో ఇసుక పై వచ్చిన నెగిటివ్ వార్తలపై పరిశీలించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, సంబంధిత తహశీల్దార్లు, పోలీస్ ఇన్స్పెక్షన్ టీంలు, వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యాత్మక ఇసుక రీచులలో సీసీ టీవీ కెమెరాలను పెట్టాలని, నిఘానుమరింత కట్టుదిట్టం చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కావల సిన ఇసుకను, తహశీల్దార్లు వారి మండలాలలో ఎన్ని ఇండ్లు ఉన్నాయి వాటికి ఎంత ఇసుక కావాలి, సరైన సమాచారం తీసుకోవాలని అన్నారు. దానికి అను గుణంగా ఇసుక అనుమతులు ఇవ్వాలని అన్నారు. ఇసుక బుకింగ్, సరఫరా పై ఫిర్యాదుల సెల్ ఏర్పాటు చేయాలని, వచ్చే ఫిర్యాదులుపరిశీలించి చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారుఈ సమావేశంలో ఇంచార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .ఎల్.బి హరి ప్రియ, అదనపు ఎస్.పిఎన్.బి.రత్నం, జడ్.పి సి .ఈ .ఓ ఇంచార్జ్ డి.పి.ఓ వెంకట రెడ్డి, ఆర్.డి.ఓ ఈ. నవీన్, జిల్లా మైన్స్ శాఖ ఏ.డి. గోవింద రాజులు అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు అభివృద్ధికి సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

ఆధీనంలో ఉన్నటు వంటి స్థలాలలో వెలిసినటువంటి డబ్బాలను తొలగింపుకు బుధవారం రోజు ఆత్మకూరు మున్సిపల్ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూర్ పట్టణ అభివృద్ధి కోసం రాష్ట్ర మంత్రివర్యులు వాకిలి శ్రీహరి ఇప్పటికే 15 కోట్ల నిధులను వెచ్చించాలని పట్టణ సమీపంలోని పరమేశ్వర స్వామి బిటి రోడ్డు వెడల్పుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వ స్థలాలలోఅక్రమంగా వెలిసిన డబ్బాలను తొలగించేందుకు మంత్రి ఆదేశాల మేరకు శ్రీకారం చుట్టామని ఈ విషయంపై రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరు అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారువిజ్ఞప్తి చేశారు. గత మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో అక్రమంగా వెలిసిన డబ్బాలను తొలగించాలంటూ ఏకగ్రీవంగా తీర్మానం చేసిన నేపథ్యంలో డబ్బాలతో ప్రధాన ప్రతిపక్ష పార్టీలు సహకరించాలని ఈవిషయంపై అక్రమస్థలాలలో వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసేందుకు సమాలోచనలు జరిపి సరైనచర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఆత్మకూర్ మున్సిపల్ కౌన్సిలర్లు దండు శ్రీనివాసులు, జుబేదా బేగం, కోట్ల తిరుపతయ్య తదితరులతోపాటుగా ముక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు తులసి రాజు యాదవ్ ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షులు పరమేష్ ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మున్సిపల్ పాలకవర్గం పాల్గొన్నారు.

## తైబజార్, పశువుల సంతకు వేలం పాట

**మద్దూరు, మార్చి25 ప్రభాతవార్త:** మద్దూరు మున్సిపాలిటీలో పురపాలక సంఘం కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన తైబజార్, పశువుల సంత వేలంపాట నిర్వహించారు. కూరగాయల మార్కెట్ వేలంపాటల్లో , పశువుల సంతకు12 మంది దరఖాస్తుదారులు చేసుకోగా మున్సిపాలిటీ కార్యాలయంలో 11 గంటలకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో కూరగాయల మార్కెట్‌ను దుద్యాల సాయిబాబ రూ, 26,25,000 లకు, పశువుల సంత జి. అశోక్ గౌడ్ రూ,22,44,914 లకుగాను వేలంపాటను దక్కించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడలో తైబజార్ వేలం

**ధన్వాడ, మార్చి25 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ధన్వాడలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం తైబజార్‌కు సంబంధించిన వేలం పాటను నిర్వహించారు. ఈ వేలంలో జట్ల గోవర్ధన్‌గౌడ్ రూ.5.12 లక్షలకు అత్యధిక ధర పలికి తైబజార్ హక్కులను సొంతం చేసుకున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ వేలం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడిందని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతి మాట్లాడుతూ తైబజార్ ద్వారా వచ్చిన ఆదాయం గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించబడుతుందని పేర్కొన్నారు. ఈ వేలం కార్యక్రమానికి గ్రామానికి చెందిన పలువురు స్థానికులు హాజరై, ఆసక్తిగా వీక్షించారు. గ్రామ అభివృద్ధికి తోడ్పడే విధంగా ఇలాంటి ఆదాయవనరులు ఉపయోగపడతాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

## ధన్వాడ పంచాయతీ సమావేశంలో ఉద్రిక్తత

### - పెండింగ్ బిల్లులపై అంజయ్య నిరసన

**ధన్వాడ, మార్చి 25 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ధన్వాడలో గ్రామపంచాయతీ సమావేశం బుధవారం ఉద్రిక్తంగా మారింది. గత కొన్ని సంవత్సరాల క్రితం గ్రామపంచాయతీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ అంజయ్య సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. సమావేశం కొనసాగుతున్న సమయంలో అంజయ్య అంబేద్కర్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని, నల్ల కండువా ధరించి తన ఆందోళనను వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన నిధుల్లోనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై సర్పంచ్ భర్తతో పాటు అంజయ్య మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతసేపు ఉద్రిక్తత నెలకొన్నప్పటికీవార్డు సభ్యులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అనంతరం అంబేద్కర్ చిత్రపటంతోనే సమావేశంలో చర్చ కొనసాగింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## ఎన్ఎస్ఎస్ వేసవి ప్రత్యేక శిబిరం ప్రారంభం

**నారాయణపేట, మార్చి 25 ప్రభాతవార్త :** నారాయణ పేట మండలం జాజాపూర్ గ్రామంలో చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో బుధవారం వేసవి ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ సంగీత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ డా. మెర్సి వసంత, యూనిట్1 ప్రోగ్రామ్ అధికారి జీ.శ్రీనివాస్, అధ్యాపకులు మధు, ప్రకాష్, గోపాల కృష్ణ, విశ్వనాథ్, అశోక్, రాము పాల్గొన్నారు. సుమారు 50 మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొన్నారు ఇదిలా ఉండగా, సింగారం గ్రామంలో యూనిట్ 3 సంగీత శాసనుపల్లి గ్రామంలో యూనిట్4 నిర్మల ఆధ్వర్యంలో 7రోజుల పాటు వేసవి ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## గురుకుల పాఠశాలలకు లింగంపల్లి విద్యార్థుల ఎంపిక

**మక్తల్ టౌన్, మార్చి25 ప్రభాతవార్త:** మక్తల్ మండలం ఎంపి యుపిఎస్ లింగంపల్లి పాఠశాల విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, ఐదవ తరగతిలో సీట్లు సాధించారు. నిన్న విడుదలైన ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు మణిదీప్ తేజ, అజయ్‌గౌడ్, నందిక గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను సర్పంచ్ వెంకటరాములు గౌడ్ , గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. గ్రామానికి పేరు తెచ్చిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా రాణించడం గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలఖకమిటీ చైర్మన్ నసీమా బేగం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, వార్డు సభ్యులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్లేఈ విజయం సాధ్యమైందని గ్రామ పెద్దలు పోషకులు పేర్కొన్నారు.